సాక్షి
నిజామాబాద్
ఆదివారం : 19 : మార్చి : 2023



బ్రహ్మోత్సవాల్లో పుష్పయాగం
నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల వేంకటేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల్లో స్వామికి చక్రస్నానం, పుష్పయాగం నిర్వహించారు.
- 8లో ▸



జల్సాల కోసం చోరీలు
జల్సాలకు డబ్బులు సరిపోవడం లేదని చోరీలకు పాల్పడుతున్న యువకులను నగర పోలీసులు అరెస్ట్ చేశారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.9 /21.8

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురియవచ్చు. వడగండ్లు పడే అవకాశముంది. సాయంత్రం, రాత్రి వేళల్లో వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆధార్ అటెండెన్స్ తొలగింపు

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో పూర్తిస్థాయిలో జియో అటెండెన్స్‌ను కొనసాగించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఆధార్ అటెండెన్స్ కొనసాగేది. గత కలెక్టర్ నారాయణరెడ్డి జియో అటెండెన్స్ ప్రవేశపెట్టి లోకేషన్, సమయం తెలియజేసేలా అటెండెన్స్ పడితేనే జీతాలు చెల్లించేలా ప్రణాళిక వేశారు. ప్రస్తుతం జిల్లాలో టీచర్లు అదే విధానాన్ని పాటిస్తున్నారు. దీంతో రాష్ట్ర అధికారులు ఆధార్ అటెండెన్స్‌ను తొలగించి జియో అటెండెన్స్‌నే కొనసాగించాలని తెలిపారు.

ముగిసిన ధాత్రి టౌన్‌షిప్ వేలం ప్రక్రియ

- ప్లాట్ల కోసం పోటీపడ్డ బిడ్డర్లు



సుభాష్‌నగర్ : నగరానికి ఆనుకుని మల్లారం వద్ద ప్రభుత్వపరంగా నెలకొల్పిన ధాత్రి టౌన్‌షిప్‌లో ప్లాట్ల విక్రయాల కోసం కొత్త కలెక్టరేట్‌లో రెండో విడతగా నిర్వహించిన బహిరంగ వేలం ప్రక్రియ శనివారంతో ముగిసింది. మొదటి రెండు రోజులు 100 ప్లాట్లకు వేలం కొనసాగగా, శనివారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ నేతృత్వంలో మిగతా 50 ప్లాట్లకు ఓ పెన్ ఆక్షన్ నిర్వహించారు. టీఎస్‌ఐఐసీ ఆధ్వర్యంలో ధాత్రి టౌన్‌షిప్‌లో సుమారు రూ. 10 కోట్లు వెచ్చించి అన్ని వసతులు కల్పించారు. ప్రభుత్వం చదరపు గజానికి ప్రారంభ ధర రూ. 6 వేలు నిర్ణయించగా, పోటాపోటీగా అంతకంటే ఎక్కువ ధర పాడి వేలంలో ప్లాట్లు దక్కించుకున్నారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, బిడ్డర్ల నుంచి ఈఎండీ ధరావత్తు రూ. 10వేల డీడీని స్వీకరిస్తూ, టోకెన్లు, దరఖాస్తుఫారాలు అందించారు. అధిక ధర పాడిన వారికి ప్లాట్ ఖరారైనట్లు ప్రకటిస్తూ కేటాయింపు లేఖలిచ్చారు. టీఎస్‌ఐఐసీ జిల్లా మేనేజర్ దినేష్, తహసీల్దార్లు సుదర్శన్, అనిల్, కలెక్టరేట్ ఏఓ ప్రశాంత్, సూపరింటెండెంట్లు రషీద్, సూర్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



ఖలీల్‌వాడి : రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని, ఆర్‌అండ్‌బీ, 44వ జాతీయ రహదారిపై అధికారులతో కలిసి ఆటోలు, జీవులపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీపీ నాగరాజు అన్నారు. శనివారం పోలీస్ ఆఫీస్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో ఏసీపీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలతో సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్‌లోని పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించి త్వరితగతిన దర్యాప్తు ముగించాలన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పోక్సో యాక్ట్ ప్రకారం 60 రోజుల్లో పరిశోధన పూర్తి చేయాలన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, లాడ్జీల్లో నిత్యం తనిఖీలు చేయాలని, సైబర్ మోసాల నియంత్రణ కోసం 1930పై అవగాహన కల్పించాలన్నారు. డయల్ 100 తక్షణమే స్పందించాలన్నారు. ఏసీపీలు కిరణ్ కుమార్, ప్రభాకర్ రావు, కెఎం కిరణ్ కుమార్, మధుసూదన్ రావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, సీసీఆర్‌బీ ఎస్సై చాందయ్య, సీఐలు, ఎస్సైలు, ఐ.టి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిపై సీపీకి ఫిర్యాదు

ఖలీల్‌వాడి : బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, అతని సోదరుడు శ్రీనివాస్‌పై నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన బొబ్బిలి మహేష్ శనివారం సీపీ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. నగరంలోని వినాయక్‌నగర్‌లోని సర్వేనం. 291లోని పంటపొలాన్ని ఓపెన్ ప్లాట్‌గా చేసి మాకు తెలియకుండానే ఇతరులకు అమ్మేశారని మహేశ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూమి తన తాత అయిన బొబ్బిలి లింగన్న పేరుతో ఉందన్నారు. ఈ విషయం 2014లో తెలిసి బస్వాలక్ష్మీనర్సయ్యని కలిసి విచారిస్తే విషయం తేల్చేందుకు ఆరునెలల గడువు అడిగారని, కేసు పెడతామని చెప్పగా కేసులు పెట్టవద్దని డబ్బులిస్తానని తొమ్మిదేళ్లయినప్పటికీ తేల్చలేదన్నారు. మూడేళ్లుగా మా తమ్ముడు మనీష్‌తో కలిసి డబ్బులివ్వాలని బస్వాను కోరగా ఉద్యోగం నుంచి తొలగిస్తామని, చంపుతామని బెదిరిస్తున్నారన్నారు. నెలక్రితం బస్వా శ్రీనివాస్ వాట్సప్ కాల్ చేస్తూ మాపై కేసులు వేస్తావా అని బెదిరించారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, ఆయన సోదరుడు బస్వా శ్రీనివాస్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో కోరారు.


వడగండ్లు.. కడగండ్లు



వంద్రికల్ తండా వద్ద మొక్కజొన్న చేనులో కురిసిన వడగండ్లు

ఉపరితల ద్రోణి ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో వాతావరణం ఉన్నట్టుండి ఒక్కసారిగా మారిపోయింది. అకాల వర్షాలు అన్నదాతను ఆగమాగం చేస్తున్నాయి. శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలను అతలాకుతలం చేసింది. చేతికొచ్చిన ధాన్యం నీళ్లలో మునిగింది. మొక్కజొన్న నేలవాలింది. ఆరబోసిన పసుపు ఇతర ఉత్పత్తులు పూర్తిగా తడిసిముద్దయ్యాయి.

- ఈదురుగాలులతో కూడిన వర్షం
- చేతికొచ్చిన వరికి తీవ్ర నష్టం
- నేలవాలిన మొక్కజొన్న, ఇతర పంటలు
- జిల్లాకు నేడు, రేపు వర్షసూచన !
- పలుచోట్ల వడగండ్ల వాన కురిసే అవకాశం



దుబ్బాకలో పంటచేనులో చేరిన నీరు, రాలిన ధాన్యం



జుక్కల్ చౌరస్తా వద్ద వంగిన స్తంభం



బాల్కొండలోని నాగంపేట్‌లో నేలకొరిగిన మక్క పంట

సుభాష్‌నగర్ : జిల్లాలోని ధర్పల్లి, ఎడపల్లి, మోపాల్, రుద్రూర్, డిచ్‌పల్లి, మాక్లూర్, తదితర మండలాల్లో శనివారం సాయంత్రం బలమైన ఈదురుగాలులతోపాటు వడగండ్ల వర్షం కురిసింది. రెండ్రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. ముఖ్యంగా ఆర్మూ ర్ డివిజన్‌లో పసుపు, మొక్కజొన్న, ఉల్లిగడ్డ, ఇతర పంటలు చేతికందాయి. ప్రస్తుతం ఆరబెడుతున్నారు. అలాగే రుద్రూర్, ఎడపల్లి, బోధన్, వర్ని, మోస్రా, చందూర్, కోటగిరి, తదితర మండలాల్లో వరి పంట చేతికందే దశకు చేరాయి. శనివారం సాయంత్రం కురిసిన వడగళ్ల వర్షానికి పలు మండలాల్లో ధాన్యం నేలరాలింది. అకాల వర్షాలకు నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలను నిలిపేశారు.

అన్నదాతల ఆందోళన..

జిల్లాకు మరో రెండ్రోజులు వర్షసూచన ఉంది. ఆదివారం అక్కడక్కడ వడగళ్ల వాన, పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. రెండు, మూడు రోజులపాటు ఆకాశం మేఘావృతమై ఉండే అవకాశముంది. అకాల వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కాగా పంటలు, పంట ఉత్పత్తుల నష్టాన్ని అంచనా వేసే పనిలో వ్యవసాయశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ప్రాథమికంగా నష్ట అంచనాను గుర్తించి తయారుచేసిన నివేదికను ఉన్నతాధికారులను నివేదించనున్నారు.

వర్షపాతం

శుక్రవారం 4.8 మిల్లీమీటర్లు, శనివారం 0.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. రోజంతా ఆకాశం మేఘావృతమై ఉండగా, ఒక్కసారిగా సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. నేడు జిల్లాలో అక్కడక్కడ వడగండ్ల వర్షం, మరికొన్ని చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశముంది.

కామారెడ్డిలో..

కామారెడ్డి క్రైం : జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా వాతావరణంలో మార్పు రావడంతో పాటు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం రావడంతో రైతన్నలు ఆందోళనకు గురయ్యారు. పలుచోట్ల కురిసిన భారీ వర్షాలకు వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. లింగంపేట, నిజాంసాగర్, గాంధారి, బాన్సువాడ మండలంలో మండలాల పరిధిలో వడగళ్లు కురిశాయి. దోమకొండలో ఈదురుగాల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది.



ముప్కాల్‌లో వర్షానికి తడిసిన పసుపు

ఎమ్మెల్సీ చేజారినా.. ఎమ్మెల్యే టికెట్ కోసం..

- నిజామాబాద్ అర్బన్ సీటు కోసం ఆకుల లలిత యత్నం
- మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ హోదాలో చక్కర్లు
- నగరంలో వివాహాలకు హాజరు, మున్నూరుకాపు సమ్మేళనాలతో హడావుడి
- అర్బన్ నుంచి కవిత సైతం పోటీ చేసే అవకాశం



ప్రగతినగర్‌లో లలిత ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ(ఫైల్)

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : సిట్టింగులకే మరోసా రి టికెట్లు అని సీఎం కేసీఆర్ ప్రకటించినప్పటికీ బీఆర్ఎస్ నుంచి టిక్కెట్లు ఆశిస్తున్న ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ టికెట్టు దక్కించుకునేందుకు రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత తనవంతుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని నెలలుగా నగరంలో విస్తృతంగా తిరుగుతున్నారు. మొదట తన సామాజికవర్గమైన మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనాలు, వనభోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా మున్నూరుకాపు మహిళా సంఘాలు ఏర్పాటు చేస్తూ, మరోవైపు వివాహాలకు, పరామర్శలకు వెళ్తూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. కేసీఆర్ పుట్టినరోజు, కేటీఆర్ పర్యటన నేపథ్యంలో నగర వ్యాప్తంగా అడుగడుగునా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పార్టీ నాయకత్వం తనకు అర్బన్ టికెట్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు లలిత చెబుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఇక్కడ తిరిగేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు చెప్పుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నియోజకవర్గంలో మైనారిటీల తర్వాత అత్యధికంగా ఉన్నది మున్నూరు కాపు ఓట్లే కావడంతో ఈ కోటాలో తనకు కచ్చితంగా టిక్కెట్ దక్కుతుందని లలిత భావిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు.

అనేక మలుపులు..

పూర్తి డైనమిక్‌గా ఉండే రాజకీయాల్లో ఆకుల లలిత రాజకీయ జీవితం ఇటీవల కాలంలో అనేక మలుపులు తిరుగుతూ వస్తోంది. తనకు తృటిలో ఎమ్మెల్సీ టికెట్ జారిపోవడంతో నామినేటెడ్ పోస్టుతో సరిపెట్టుకున్నారు. ఈ ప్రొటోకాల్‌తో నగరంలో తిరుగుతూ వచ్చే ఎన్నికల్లో అర్బన్ టికెట్ రేసులో ఉన్నట్లు చెప్పకనే చెబుతున్నారు. 2008 ఉపఎన్నికల్లో డిచ్‌పల్లి నుంచి కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన లలిత 2009లో నిజామాబాద్ రూరల్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2016లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2018 ఎన్నికల్లో ఆర్మూర్ నుంచి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేశారు. అయితే పోలింగ్‌కు మూడు రోజుల ముందే బీఆర్ఎస్‌తో అంతర్గత ఒప్పందం చేసుకుని అస్త్రసన్యాసం చేసినట్లు రాజకీయ వర్గాలతో పాటు ఇతర అన్నివర్గాలు కోడై కూస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు రాక ముందే బీఆర్ఎస్‌లో చేరారు.

మరోసారి ఎమ్మెల్సీ పదవి కొనసాగింపు కోసం కేసీఆర్ నుంచి హామీ తీసుకుని తన వియ్యంకుడు నేతి విద్యాసాగర్‌తో కలిసి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. అయితే ఎమ్మెల్సీ అవకాశం మరోసారి దక్కలేదు. ఎంపీగా ఓటమిపాలైన కేసీఆర్ కుమార్తె కవితకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడంతో లలితకు నిరాశే మిగిలింది. చివరకు రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే ప్రస్తుతం కవిత మహిళా బిల్లు కోసం జాతీయ స్థాయిలో పోరాటం చేస్తున్న నేపథ్యంలో మహిళా కోటా, మున్నూరుకాపు కోటాలో అర్బన్ టికెట్ కోసం ఆశలు పెట్టుకుని నగరంలో తిరుగుతున్నట్లు చర్చ జరుగుతోంది.

అయితే కవిత కూడా అర్బన్ నుంచి పోటీ చేయవచ్చనే చర్చ జరుగుతున్న నేపథ్యంలో లలితకు మరోసారి కవిత రూపంలో అడ్డంకి ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా 2018 ఎన్నికల్లో ఆర్మూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున ఆకుల లలిత పోటీ చేసినప్పుడు ఆమె వెంట తిరిగిన క్యాడర్‌ను ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఇబ్బందులు పెట్టడంతో, ఈసారి లలిత ఎక్కడ పోటీ చేసినా వ్యతిరేకంగా పనిచేస్తామని సదరు నాయకులు, కార్యకర్తలు చెబుతుండడం గమనార్హం.

లీకేజీల ప్రభుత్వాన్ని సాగనంపుదాం

- నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారు
- సర్కారును నిలదీసేందుకే నిరుద్యోగ నిరసన దీక్ష
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది
- ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం
- ప్రాణహిత–చేవెళ్లను పూర్తి చేసి సాగునీరందిస్తాం
- యాత్ర ఫర్ చేంజ్ పాదయాత్రలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి భరోసా



చిన్నమల్లారెడ్డిలో యాత్రలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సోనియమ్మ రాష్ట్రాన్ని ఇస్తే మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ అన్ని వర్గాల ఆశలు వమ్ము చేశారని, ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్లతో నిరుద్యోగులు ఎన్నో కష్టాలు పడి చదువుకుంటే, పరీక్షా పత్రాల లీకేజీలతో వారి ఆశలు వమ్మయ్యాయన్నారు. లీకేజీల ప్రభుత్వాని సాగనంపుదామని పిలుపునిచ్చారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన యాత్ర ఫర్ చేంజ్ పాదయాత్ర శనివారం కామారెడ్డి నియోజక వర్గంలో కొనసాగింది. ఉదయం సరంపల్లి చౌరస్తా నుంచి సరంపల్లి, చిన్నమల్లారెడ్డి మీదుగా రాజంపేటకు చేరింది. అక్కడ కార్నర్ మీటింగులో మాట్లాడారు. సాయంత్రం కామారెడ్డి పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులోని క్లాసిక్ ఫంక్షన్ హాల్ నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు పాదయాత్ర చేశారు. వర్షంలోనూ జనం ఆయన వెంట నడిచారు. వర్షంలోనే సభ జరిగింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో చదవని కేటీఆర్‌కు నిరుద్యోగుల కష్టాలు ఎలా తెలుస్తాయన్నారు. గ్రూప్–1 పేపర్ లీకేజీ లో కేటీఆర్ పీఏ కు సంబంధం ఉందన్నారు. అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న 2లక్షల ఉద్యోగాలను ఏడాదిలోగా భర్తీ చేస్తామన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాన్ని సీబీఐతో లేదా సిట్టింగ్ జడ్జీతో విచారణ చేయించాలని డిమాండ్‌చేస్తూ నేడు గాంధారిలో నిరసన దీక్ష చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఎమ్మెల్యే గంపపై ఫైర్

కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌పై రేవంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. మేకతోలు కప్పుకున్న తోడేలుతో పోల్చారు. రింగురోడ్డు పేరుతో రైతుల నోట్లో మట్టి కొట్టేందుకు కుట్ర చేశాడని, రైతులంతా తిరగబడడంతో వెనక్కి తగ్గినా, ఎన్నికల తర్వాత మళ్లీ భూములను గుంజుకుంటారని అందుకే రైతులు వచ్చే ఎన్నికల్లో గంప గోవర్ధన్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కామారెడ్డిలో షబ్బీర్‌ను 2004లో కన్నా ఎక్కువ మెజారిటీతో గెలిపించాలని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆయన కీలక స్థానంలో ఉంటాడని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీఎంగా ఉన్నపుడు ప్రాణహిత–చేవెళ్ల పథకానికి శ్రీకారం చుట్టి, 22వ ప్యాకేజీతో కామారెడ్డి ప్రాంతానికి నీరిచ్చేందుకు పనులు చేపట్టారని, అయితే ప్రస్తుత పాలకులు పనులు మూలన పడేశారన్నారు. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 22వ ప్యాకేజీ పనులను పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. యాత్రలో మాజీ మంత్రులు షబ్బీర్‌అలీ, సుదర్శన్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి సుభాష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్, మల్లురవి, అయోధ్యరెడ్డి, కైలాస్ శ్రీనివాస్ తదితరులున్నారు.

శానిటేషన్‌లో గోల్‌మాల్

- రెగ్యులర్ ఉద్యోగిని ఖాళీగా ఉంచి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు విధులు
- ఏళ్ల తరబడిగా డిప్యుటేషన్‌పై ఓ శానిటరీ ఇన్‌స్పెక్టర్ విధులు
- అర్హత లేకున్నా ఎస్సైగా పనిచేస్తున్న మరో వర్క్ ఇన్‌స్పెక్టర్
- పోస్టింగ్ ఇవ్వకపోవడంతో వెళ్లిపోయిన ఇద్దరు ఎస్సైలు



నగరంలో శానిటేషన్ పరిస్థితి..

జోన్లు	6
కార్యాలయాలు : నాందేవ్‌వాడ, గోల్‌హనుమాన్, పెద్దబజార్, రాజీవ్‌గాంధీ ఆడిటోరియం, కంఠేశ్వర్, అర్సపల్లి	
ఒక్కోజోన్ కింద పనిచేస్తున్న కార్మికులు(సుమారు)	200
మొత్తం పారిశుధ్య కార్మికులు (సుమారు)	1,250

నిజామాబాద్ నాగారం : నగరంలో కార్పొరేషన్ కార్యాలయంలోని శానిటేషన్ విభాగంలో పాలన ఇష్టారాజ్యంగా మారింది. బల్దియాలో అత్యంత కీలకమైన శానిటేషన్ శాఖలో ప్రధాన పోస్టులు ఖాళీగా ఉండడంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులదే హవా నడుస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషనర్ రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులనే ఆరు జోన్లకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమించారు. శానిటేషన్‌లో అంతులేని అవినీతి జరిగిందని ఇటీవల ప్రత్యేక అధికారుల ఆకస్మిక తనిఖీల్లో వెల్లడైన విషయం విదితమే.

నామమాత్రపు విధులిచ్చి..

నగరం పరిశుభ్రంగా ఉండాలంటే శానిటేషన్ విభాగంతోనే సాధ్యమవుతోంది. 2022 జనవరిలో జిల్లా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి ముగ్గురు రెగ్యులర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వచ్చారు. షాద్‌నగర్ బల్దియా నుంచి నగేశ్, శంషాబాద్ బల్దియా నుంచి లక్ష్మణ్, సిద్దిపేట్ నుంచి షాదుల్లా బదిలీపై నగరానికి వచ్చారు. అ యితే వీరికి ఎస్సైలుగా పోస్టింగ్ ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా నామమాత్రపు విధులు కేటాయించడంతో అసహనానికి గురైన ఇద్దరు ఎస్సైలు ఆర్నెళ్లుగా సెలవులో ఉన్నారు. మరో ఎస్సైకి జోన్–1లో నామమాత్రపు విధులు అప్పజెప్పారు. అలాగే హెల్త్ అసిస్టెంట్‌గా వచ్చిన విజయ్‌బాబుకు కూడా సంబంధం లేని విధులు అప్పజెప్పడంతో ఆయన సంగారెడ్డికి డిప్యుటేషన్‌పై వెళ్లిపోయారు. ఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి వైద్యుడై ఉండాల్సి ఉండగా ఓ సూపర్‌వైజర్‌కు విధులు కేటాయించడంతో విమర్శలు వెల్లువెత్తాయి.

ఇన్‌చార్జీలతోనే అక్రమాలు..

శానిటేషన్ విభాగంలో పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. నగరంలో ఈ విభాగం కింద ఆరు జోన్ కార్యాలయాలు ఉన్నాయి. రోజువారి విధుల్లో చాలామంది ఉద్యోగులు డుమ్మా కొడుతున్నప్పటికీ వారికి హాజరు పడుతూనే ఉంది. గత నెలలో కమిషనర్ చిత్రామిశ్రా ఆదేశాల మేరకు విభాగంలో ఒకరోజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా ఇన్‌చార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ల బాగోతం బయటపడ్డ విషయం విదితమే. ఇప్పటికీ బదిలీ వర్కర్ల తతంగం ఇంకా నడుస్తూనే ఉంది. అయితే ఆరుజోన్ల పరిధిలో ఒక్క జోన్‌కు కూడా పూర్తిస్థాయి ఎస్సై లేరు. అంతా ఇన్‌చార్జీలే. ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వారు విధులు నిర్వహించాలి. బయోమెట్రిక్ హాజరు వేయాల్సిందే. అయితే ఆరుగురు ఎస్సైలలో నలుగురు ఔట్‌సోర్సింగ్ కాగా, గోల్‌హన్మాన్ జోన్ ఆఫీస్ ఎస్సై వైద్యారోగ్య శాఖ నుంచి ఏళ్ల క్రితం డిప్యుటేషన్‌పై వచ్చి ఇక్కడే పాతుకుపోయారు. అలాగే కంఠేశ్వర్ జోన్ ఇన్‌చార్జీగా అర్హత లేని వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించారు. హెల్త్‌కు సంబంధించిన సర్టిఫికేషన్ చేసిన వారే ఎస్సైగా పోస్టింగ్ ఇవ్వాల్సి ఉండగా ఇంజినీరింగ్ సెక్షన్ నుంచి వచ్చిన వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు ఎస్సైగా నియమించారు.

రాజకీయ నాయకుల అండతోనే..

శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లుగా బదిలీపై జిల్లాకు వచ్చిన వారికి నామమాత్రపు విధులు అ ప్పజెప్పి టైంపాస్ చేస్తున్నారు. అసలైన పోస్టింగ్‌లలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే తిష్ట వేశారు. వచ్చిన వారికి అధికార పార్టీ నాయకులతో ఒత్తిడి చేయించడంతో వారు ఇక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. శానిటేషన్‌లో అక్రమాలపై 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. కమిషనర్ దృష్టి పెడితేనే ఈ విభాగం గాడిన పడేట్టుంది.

హరితహారానికి సిద్ధం కావాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవీపేట : నవీపేటతో పాటు అబ్బాపూర్(ఎం), అభంగపట్నం, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అబ్బాపూర్(ఎం) లోని నర్సరీ, అభంగపట్నం, నవీపేటల్లోని నర్సరీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మరో రెండు నెలల్లో హరితహారం నిర్వహిస్తుండడంతో అన్ని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. నవీపేట శివారులోని శ్మశాన వాటిక రోడ్డు పనులను పరిశీలించారు. ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. నిజాంసాగర్ డీ–50 ప్రధాన కాలువలో పూడికను తొలగించాలన్నారు. నవీపేట్‌లో బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించారు. గదుల నిర్మాణానికి నిధులు కావాలని సర్పంచ్ ఆసోల్ల శ్రీనివాస్ కోరగా బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలకు రూ. 73 లక్షలు, రూ. 59 లక్షలు మంజూరయ్యాయని, తీర్మానాలు చేయాలని సూచించారు. ఉర్దూ మీడియం స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడారు. నవీపేటలో మేకల సంతకు వేరే ప్రాంతం కేటాయించాలని ఎంపీపీ సంగెం శ్రీనివాస్ కలెక్టర్‌ను కోరారు. బాలికల ఉన్నత పాఠశాలకు ఎఫ్‌సీఐ గిడ్డంగులను కూల్చి స్థలం ఇవ్వాలని వార్డు సభ్యుడు నవీన్‌రాజ్ కోరారు. జెడ్పీ చైర్మన్ విఠల్‌రావ్, బీఆర్ఎస్ నాయకులు రాంకిషన్ రావ్, డ్వామా పీడీ చందర్‌నాయక్, డీఈవో దుర్గాప్రసాద్, లింగాపూర్ సర్పంచ్ సాయిలు ఉన్నారు.

క్లుప్తంగా

ఇంటర్‌ ఇంగ్లిష్‌ పేపర్‌లో తప్పులు



నిజామాబాద్‌అర్బన్‌: ఇంటర్‌ సెకండియర్‌ విద్యార్థులకు శనివారం ఇంగ్లిష్‌ పరీక్ష జరిగింది. ఇందులో తప్పులు వచ్చాయి. రెండో భాగంలో నాలుగు ప్రశ్నలకు ఒక్కోదానికి ఒక మార్కు చొప్పున ఉండాలి. కానీ ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు అని ప్రింట్‌ అయింది. దీంతో ప్రింటింగ్‌ తప్పుగా వచ్చిందని గుర్తించిన అధికారులు నాలుగు ప్రశ్నలకు ఒక్కో మార్కు అని చెప్పారు. శుక్రవారం జరిగిన ఫస్టియర్‌ ఇంగ్లిష్‌ పరీక్షల్లో కూడా తప్పులు వచ్చాయి.

ఒకరు డిబార్‌

నవీపేట మోడల్‌ స్కూల్‌లో ఒక విద్యార్థి కాపీయింగ్‌ పాల్పడుతుండగా అధికారులు పట్టుకొని డిబార్‌ చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 634 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో తెలిపారు.

ఓపెన్‌ పీజీ, డిగ్రీలో ప్రవేశాలకు అవకాశం

నిజామాబాద్‌అర్బన్‌:రాంరెడ్డి దూరవిద్య కేంద్రంలో పీజీ, డిగ్రీలో ప్రవేశాలు పొందవచ్చునని గిరిరాజ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ రామ్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23కి డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా కోర్సు ల్లో ప్రవేశాలకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.వివరాలకు 9490901050 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పెట్రోల్‌ తక్కువ వస్తోందని ఆందోళన



తాడ్వాయి: తాడ్వాయిలోని ఇండియన్‌ ఆయిల్‌ పెట్రోల్‌ బంకులో పెట్రోల్‌ తక్కువ వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. శనివారం మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన ఒకరు ఆ బంకులో వంద రూపాయల పెట్రోల్‌ను బాటిల్‌లో పోయించుకున్నాడు. తీరా తక్కువ రావడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

మోపాల్‌: మండలంలోని మంచిప్ప నుంచి అమ్రాబాద్‌ వెళ్లే మార్గంలో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యాన్ని శనివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్‌ఐ మహేష్‌ తెలిపారు. బస్సీ రంజిత్‌ ఆటోలో అక్రమంగా పీడీఎస్‌ బియ్యాన్ని పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు పట్టుకున్నారు. రంజిత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బియ్యం లారీ..

రుద్రూర్‌: మండలంలోని రాణంపల్లి శివారులో శనివారం బియ్యం లారీని అధికారులు పట్టుకున్నారు. వర్ని, కోటగిరి మండలాల్లో నుంచి పీడీఎస్‌ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు నిఘా పెట్టి లారీని పట్టుకొని ఠాణాకు తరలించారు. టెక్నికల్‌ బృందం పరిశీలన తర్వాత చర్యలు తీసుకుంటామని డీఎస్‌వో చంద్రప్రకాశ్‌ తెలిపారు.

అకాల వర్ష బీభత్సం

- వడగండ్ల వానతో పంటలకు నష్టం
- ఆందోళనలో అన్నదాతలు

ఉమ్మడి జిల్లాలో వర్షం బీభత్సం సృష్టించింది. శనివారం సాయంత్రం పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పలు గ్రామాల్లో వడగండ్లు పడ్డాయి. అకాల వర్షంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు.

నిజాంసాగర్‌: నిజాంసాగర్‌ మండలంలోని సుల్తాన్‌నగర్‌ గ్రామ పొలిమెరల్లో తాటి చెట్టుపైన పిడుగు పడటంతో మంటలు అంటుకున్నాయి. తున్కిపల్లి గ్రామంలోని సిర్నపల్లి సాంబయ్య ఇంటి పైకప్పు రేకులు కొట్టుకుపోయాయి. జుక్కల్‌ చౌరస్తా కరెంట్‌ స్తంభాలు కిందకు వంగాయి. బిచ్కుంద రోడ్డు మార్గంలో చెట్లు నేలకూలడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

లింగంపేట: మండలంలోని బాణాపూర్‌ తండా, మోతె, వండ్రికల్‌ గ్రామాల శివారులో వడగండ్ల వాన కురిసింది. వడగళ్లు భారీగా పడటంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వర్షంతో పాటు ఈదురు గాలులు, వడగండ్లు కురియడంతో గుడిసెల పైకప్పులు, పాకల రేకులు పైకి లేచాయి. పంట చేనుల్లో మామిడి కాయలు రాలాయి. మామిడి చెట్లకు, వరి పంటలకు నష్టం వాటిల్లినట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. బాణాపూర్‌ తండాలో భారీగా వడగళ్లు పడ్డాయి.

బాన్సువాడటౌన్‌: బాన్సువాడలో ఈదురుగాలులతో పాటు భారీ వర్షం కురిసింది. పట్టణంలోని స్టేట్‌ బ్యాంకు సమీపంలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ఉండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనాలను పోలీస్‌ స్టేషన్‌ ముందు నుంచి తాడ్కోల్‌ చౌరస్తాకు మళ్లించారు. వరి పంటలు నేలకొరిగాయి.



వండ్రికల్‌లో కురిసిన వడగండ్లు

గాంధారి: మండలంలోని వండ్రికల్‌, గుర్జాల్‌, బ్రాహ్మణ్‌పల్లి, మాతుసంగెం, పేట్‌ సంగెం గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వడగండ్ల వాన కురిసింది. మొక్కజొన్న, వరి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. వండ్రికల్‌, మాతు సంగెం, గుర్జాల్‌ గ్రామాల్లో చేతికొచ్చిన మొక్కజొన్న నేలకొరిగింది.

మద్నూర్‌: మద్నూర్‌, డోంగ్లీ మండలాల్లో జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలకు నష్టం వాటిల్లింది. మూడు రోజులుగా వరుసగా భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



లింగంపేట మండలం బాణాపూర్‌ తండాలో..

పెద్దకొడప్‌గల్‌: మండల కేంద్రంతో పాటు చావుని తండా, శివాపూర్‌, పోచారం తండా, తలాబ్‌ తండాలల్లో ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం పడింది.

రుద్రూర్‌: రుద్రూర్‌ మండలం రాణంపల్లి శివారులో కోటగిరి–రుద్రూర్‌ ప్రధాన రహదారిపై రెండు వృక్షాలు నేలకొరిగాయి. దీంతో ట్రాఫిక్‌ అంతరాయం ఏర్పడింది.

ధర్పల్లి: మండలంలోని దుబ్బాక, రేకులపల్లి గ్రామాల్లో వర్షానికి వరి పంటకు నష్టం వాటిల్లింది. పాల దశలో ఉన్న వరి గింజలు నేల రాలిపోయాయి. కోతకు వచ్చిన మొక్కజొన్న నేలకుఒరిగింది. మామిడి నేలరాలింది. మిరప, కూరగాయ పంటలు దెబ్బతిన్నట్లు గ్రామస్తులు తెలిపారు.



చావునితండాలో కురుస్తున్న వడగండ్ల వాన.. దుబ్బాకలో కురిసిన వడగండ్లు (ఇన్‌సెట్‌లో)

ఎడపల్లి: మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో వడగండ్ల వర్షంతో వరి పంట నష్టం వాటిల్లింది. గ్రామంలో 400 ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లిందని ఏవో సిద్ధిరామేశ్వర్‌ తెలిపారు.

పసుపు పంటకు నష్టం

బాల్కొండ: అకాల వర్షంతో ఉడికించి కళ్లాల్లో ఆరబెట్టిన పసుపు పంట తడిసి ముద్దయింది. పసుపు పంటను ఆరబెట్టిన తర్వాత తడిస్తే చందూరం(ఎరుపు రంగు) ఏర్పడుతుంది. దీంతో మార్కెట్‌లో సగం ధరకు కూడా వ్యాపారులు కొనుగోలు చేయారని రైతులు వాపోతున్నారు. అసలే దిగుబడి లేక, ధర లేక దిగులుగా ఉన్న పసుపు రైతుకు ములిగేనక్క మీద తాటికాయ పడ్డాట్టు వర్షం వెంటాడుతుంది. మక్క పంట కొంత నూర్పిడి చేసి రోడ్లపై ఆరబెట్టారు. ఆరబెట్టిన మక్కలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. నూర్పిడి చేయని మక్కపంట నేలకొరిగింది. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



రుద్రూర్‌- కోటగిరి రహదారిపై పడ్డ చెట్టు

ఈదురు గాలులకు అదుపుతప్పి..

నస్రుల్లాబాద్‌ (బీర్కూర్‌):బీర్కూర్‌ మండలం అన్నారం వద్ద శనివారం సాయంత్రం ఈదురు గాలుల బీభత్సానికి ఆటో, బైక్‌ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. మహారాష్ట్ర సగ్రోల్లికి చెందిన ఆటో బాన్సువాడలో శుభకార్యానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉండగా, బీర్కూర్‌ నుంచి కొల్లూరు వెలుతున్న బైక్‌ ఈదురు గాలులకు అదుపు తప్పి ఆటోను ఢీ కొట్టింది. బైక్‌పై ఉన్న కొల్లూరుకు చెందిన చాకలి సాయిలు కాలు విరిగింది. ఆటో చివరలో కూర్చున్న సగ్రోల్లికి చెందిన మారుతి రెండు కాళ్లు విరిగాయి. స్థానికులు క్షత గ్రాతులను బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



గాయపడ్డ మారుతి



కుర్నాపల్లిలో రాలిన వడ్లు



బీర్కూర్‌లో ఇళ్లలోకి చేరిన నీరు



బాన్సువాడలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



సుల్తాన్‌నగర్‌లో పిడుగుపడి కాలుతున్న చెట్టు



పెద్దకొడప్‌గల్‌లో వడగండ్లు ఏరుతున్న యువకులు

ఘనంగా చక్రస్నానం

మోపాల్‌: మండలంలోని నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి చక్రస్నానం, శ్రీ పుష్పయాగం నిర్వహించారు. ఉత్సవాల్లో మహా పూర్ణాహుతి అనంతరం దేవనాథ జీయర్‌ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజదాస్‌ స్వామి ప్రవచనాలు చేశారు. ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, దిల్‌ రాజు, శిరీష్‌ రెడ్డి, విజయసింహారెడ్డి, హరీష్‌ దంపతులు, సర్పంచ్‌ సాయిరెడ్డి, ఎంపీటీసీ రాములు, గంగాధర్‌, రవీందర్‌ యాదవ్‌, నరాల సుధాకర్‌, నర్సారెడ్డి పాల్గొన్నారు.

సినీ ప్రముఖుల సందడి

బ్రహ్మోత్సవాల కోసం దిగ్గజ దర్శకులు, నిర్మాతలు, సినీ ప్రముఖులు నర్సింగ్‌పల్లికి తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. దర్శకులు వంశీ పైడిపల్లి, హరీష్‌ శంకర్‌, పరశురాం, వెంకి అట్లూరి, బింబిసార వశిష్ట, వాసు వర్మ, కిషోర్‌, శశి, యష్‌ మాస్టర్‌, నిర్మాతలు రవికిశోర్‌, సమీర్‌రెడ్డి, చిట్టూరి శ్రీనివాస్‌, నటుడు సురేందర్‌ రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.



చక్రస్నానం నిర్వహిస్తున్న వేద పండితులు



ఇందూరు తిరుమలలో వంశీ పైడిపల్లి, వశిష్ట, యష్‌ మాస్టర్‌, హరీష్‌ శంకర్‌

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



డిచ్‌పల్లి: మహిళలు కాలానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని డీఆర్‌డీవో చందర్‌ నాయక్‌ సూచించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని సాంకేతిక శిక్షణ అభివృద్ధి కేంద్రం (టీటీడీసీ)లో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా సమాఖ్య సభ్యులకు, ఐకేపీ సిబ్బందికి పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఆర్‌డీవో మాట్లాడుతూ.. ఆర్థికంగా ఆదాయం వచ్చే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు విప్లవకుమారి, కోశాధికారి వనిత, కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

అలరించిన టెక్‌ ట్రోనిక్‌ ప్రదర్శన



ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థినులు



మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్‌

నిజామాబాద్‌అర్బన్‌:విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని డీఈవో దుర్గాప్రసాద్‌ అన్నారు. శనివారం శ్రీరామ గార్డెన్‌లో కాకతీయ ఒలింపియాడ్‌ పాఠశాల విద్యార్థులు టెక్‌ ట్రోనిక్‌ 2023 ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఈవో మాట్లాడారు. జిల్లా ఇంటర్‌ విద్యాధికారి రఘురాజు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే సాంకేతిక పరిజ్ఞానంతో ఇలాంటి ప్రదర్శనలు ప్రోత్సహించడం బాగుందన్నారు. విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌ రజినీకాంత్‌, రామోజీరావు తేజస్విని, నటరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ మహాసభ వేదికకు భూమిపూజ

బోధన్‌: మహారాష్ట్రలో బీఆర్‌ఎస్‌ పార్టీ విస్తరణకు నాయకత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ప్రాంతం నాందేడ్‌ జిల్లా పరిధిలోని కందార్‌ లోహ నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 26 న భారీ బహిరంగ సభ తలపెట్టింది. శనివారం కందార్‌ లోహలో బీఆర్‌ఎస్‌ నాందేడ్‌ జిల్లా ఇన్‌చార్జి బోధన్‌ ఎమ్మెల్యే షకీల్‌, ఆర్మూర్‌ ఎమ్మెల్యే జీవన్‌ రెడ్డి సభా వేదిక వద్ద భూమిపూజ చేశారు. కందార్‌ లోహ మాజీ ఎమ్మెల్యే శంకర్‌, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యేలు షకీల్‌, జీవన్‌రెడ్డి

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్‌

- కంటైనర్ల దోపిడీకి పాల్పడిన ఏడుగురు
- నాటు తుపాకులు, బుల్లెట్లు, కత్తులు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఆదిలాబాద్‌ ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్‌: అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఆదిలాబాద్‌ పోలీసులు పట్టుకున్నారు. ఇటీవల ఇచ్చోడ మండలం దేవుల్‌నాయక్‌ తండా సమీపంలో డ్రైవర్‌ను కత్తితో పొడిచి కంటైనర్‌ను, అందులోని సామగ్రిని దోపిడీ చేసిన విషయం తెలిసిందే. శనివారం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. రాజస్తాన్‌లోని బరంపూర్‌ జిల్లా జిరాహీరా గ్రామానికి చెందిన మహ్మద్‌ హర్షద్‌ నిర్మల్‌ జిల్లా సారంగపూర్‌ మండలం స్వర్ణ గ్రామంలోని మదర్సాలో బోధకుడిగా పని చేస్తున్నాడు. అతడితో పాటు రాజస్తాన్‌కు చెందిన నసీమ్‌, ముజాహిద్‌ఖాన్‌, ఉత్తరప్రదేశ్‌కు చెందిన జాకీర్‌ఖాన్‌, ముస్తాక్‌ఖాన్‌తోపాటు నిజామాబాద్‌ జిల్లా జక్రాన్‌పల్లికి చెందిన మహ్మద్‌ సాజిద్‌ఖాన్‌ ఈ నెల 13న అర్ధరాత్రి కంటైనర్‌ దోపిడీకి పాల్పడ్డారు. డ్రైవర్‌ను కత్తితో పొడిచి అక్కడి నుంచి కంటైనర్‌ను ఎత్తుకెళ్లారు.

దోపిడీ ఇలా

ఈ నెల 13న రాత్రి 9 గంటల ప్రాంతంలో జాఫర్‌ ఖాన్‌, ముస్తాక్‌ఖాన్‌ రెండు కత్తులు, జాకీర్‌, మజాహిద్‌ ఒక నాటు తుపాకీ, ఏడు రౌండ్ల బుల్లెట్లు తీసుకొని కారులో దోపిడీ కోసం ఆదిలాబాద్‌ వైపు వెళ్లారు. ఇచ్చోడ శివారులో దోపిడీకి పాల్పడేందుకు కాపు కాశారు. లారీలో ఒంటరిగా ఉన్న డ్రైవర్‌ను చూసి రెక్కీ నిర్వహించారు. అర్ధరాత్రి ఒకటిన్నర ప్రాంతంలో దేవుల్‌ నాయక్‌తండా బస్టాండ్‌ దగ్గర కంటైనర్‌కు కారును అడ్డం పెట్టారు. డ్రైవర్‌ ఆపగానే హర్షద్‌, జాఫర్‌ఖాన్‌, ముస్తాక్‌ఖాన్‌ తమ వద్ద ఉన్న తుపాకీతో డ్రైవర్‌ను బెదిరించారు. కేకలు వేయడంతో కత్తులతో పొడిచి గాయపర్చారు. తలపై రాడుతో కొట్టారు. కంటైనర్‌ నుంచి డ్రైవర్‌ను కిందకు దించి తమ కారులో బంధించారు. అందులో ఒక వ్యక్తి కంటైనర్‌ను నడుపుతూ నేరడిగొండ వరకు తీసుకెళ్లాడు. ఆ తర్వాత నేరడిగొండలో అద్దెకు తీసుకున్న ఇంట్లో హల్దీరామ్‌ ప్యాకెట్లను భద్రపర్చారు. అనంతరం కంటైనర్‌ను జాకీర్‌ తీసుకెళ్లి బాల్కొండ మండలం శ్రీరాంపూర్‌ వద్ద డ్రైవర్‌, కంటైనర్‌ను వదిలి వెళ్లాడు. ఉదయం 8 గంటల ప్రాంతంలో నిర్మల్‌లోని స్వర్ణ గ్రామానికి తిరిగి వచ్చారు. కాగా, ఈ దోపిడీకి ముందు మరో దొంగతనానికి పాల్పడ్డారు. 12న సంగారెడ్డి సమీపంలో ఓ కంటైనర్‌లోని ఫ్లిప్‌కార్ట్‌ సామగ్రిని దొంగిలించారు. ఈ ముఠా నుంచి రూ.4 లక్షల విలువైన 360 హల్దీరామ్స్‌ బాక్సులు, రెండు నాటు తుపాకులు, 14 తపంచా రౌండ్లు, రెండు కత్తులు, రెండు ఐరన్‌ రాడ్లు, మహేంద్ర వాహనం, కారు, బైక్‌, రూ.1,52,910 విలువైన ఫ్లిప్‌కార్ట్‌ సామగ్రి స్వాదీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న వస్తువులు

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌లోని ఆలూర్‌ బైపాస్‌ రోడ్డులో శుక్రవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో నిర్మల్‌ జిల్లా లోకేశ్వర మండలం అవర్గ గ్రామానికి చెందిన ఎర్రోజు శ్రావణ్‌కుమార్‌(31) మృతి చెందాడు. శ్రావణ్‌కుమార్‌ ఆర్మూర్‌లో తన పనులు ముగించుకొని తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా బైపాస్‌ మూలమలుపు వద్ద గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ ఆయన మృతిచెందాడు. మృతుడి తల్లి వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

సిరికొండ: మండలంలోని జగదాంబ తండాకు చెందిన నందిలాల్‌ అనే యువకుడు పురుగు మందు తాగి శనివారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ప్రేమ వ్యవహారంలో యువకుడు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. చికిత్స నిమిత్తం 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బైక్‌ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిరూరల్‌: బైక్‌ అదుపు తప్పి ఇద్దరు గాయపడిన ఘటన శనివారం ఎల్లారెడ్డిలో చోటుచేసుకుంది. మండలంలోని సోమర్యాగడి తండాకు చెందిన ధనావత్‌ గోపి, జేమ్లా బైక్‌పై ఎల్లారెడ్డి వస్తున్నారు. పట్టణంలోని కోఆపరేటివ్‌ బ్యాంకు ఎదుట ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బైక్‌పై నుంచి వారు కిందపడ్డారు. ప్రమాదంలో గోపి కాలు విరగగా, జేమ్లాకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

నిందితుల రిమాండ్‌



రాజంపేట: రాజంపేటలో గత ఆదివారం జరిగిన కొప్పుల ఆంజనేయులు హత్య కేసులో నిందితులకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తిరుపయ్య, ఎస్సై రాజు తెలిపారు. ఆంజనేయులు మనవడు భానుప్రసాద్‌, కుమార్తెలు లీలావతి, లక్ష్మీనర్సవ్వ ఇంట్లోనే నిప్పట్టించి హత్యకు పాల్పడినట్లు ఆయన పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి కామారెడ్డి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌ విధించారన్నారు.

బొలేరో బోల్తా

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని పెద్ద చెరువు కట్టపై బొలేరో వాహనం శనివారం బోల్తా పడింది. బాన్సువాడ వైపు నుంచి మెదక్‌ వైపు వెళ్తున్న బొలేరో వాహనం అతి వేగంగా వెళ్తుండటంతో ప్రమాదవశాత్తు బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్‌

ఖలీల్‌వాడి: జల్సాలకు డబ్బులు సరిపోవడం లేదని చోరీలకు పాల్పడుతున్న నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ కిరణ్‌కుమార్‌ శనివారం వివరాలు వెల్లడించారు. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన కుమ్మం శ్రావణ్‌యాదవ్‌, ఇటుకల మహేష్‌, బక్కెట్టి నితిన్‌, సూర్యవంశీ సాయికుమార్‌ స్నేహితులు. అదరు కలిసి మద్యం తాగేవారు. సూర్యవంశీ సాయికుమార్‌ గతంలో జైలుకి వెళ్లి వచ్చాడు. తమ జల్సాలకు డబ్బులు సరిపోవడం లేదని, అందరం కలిసి దొంగతనాలు చేసి బాగా డబ్బు సంపాదిద్దామని సాయికుమార్‌స్నేహితులకు చెప్పారు. మిగతా వారు సరే అనడంతో అందరూ కలిసి దొంగతనాలు చేయడం ప్రారంభించారు. తాళాలు ఉన్న ఇల్లు, ఇంటి ముందు పార్క్‌ చేసిన బైక్‌లను చోరీ చేసేవారు. ఈ నెల 4న నగరంలోని ఆర్టీసీ కాలనీలో మధ్యాహ్నం తాళం వేసిన ఇంటిలోకి చొరబడి చోరీ చేశారు. ఈ దొంగతనంలో బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు చోరీ చేసి వారి బైక్‌పై పారిపోయినట్లు తెలిపారు. బైక్‌పై నగరంలోని మార్వాడీగల్లీలోని తిరుగుతున్న సమయంలో పోలీసులు అనుమానంతో పట్టుకున్నట్లు ఏసీపీ చెప్పారు. ఆర్‌టీసీ కాలనీకి చెందిన పల్లికొండ సాగర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వారి నుంచి బంగారు ఆభరణాలు, ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నార్త్‌ సీఐ నరహరి, ఎస్సై యాదగిరి ఉన్నారు.